# అవివాహితగానే వుండిపోతా కానీ-

ఇప్పటికి మూడేళ్ళు గడిచాయ్ – నా వయస్సిప్పుడు పద్దెనిమిది. ఇంకా నాకు భర్త కాదగిన వాడు దొరకలేదు. అవసరమైతే యింకా ముప్పై ఏళ్ళయినా – జీవితాంతం వరకు కూడా – యిలా పడివుంటే వుంటాను కాని అనర్హుణ్ణి కట్టుకొని నా జీవితము బూడిద పోసిన పన్నీరు చేయలేను.

ఏం చెయ్యను...?

చాణుక్యుని పౌరుషాన్ని మెచ్చుకోటానికి అలవాటుపడ్డ నేను–

–ఆఫీసులో, అధికార ప్రియుడైన ఆఫీసరు, చీటికీమాటికీ అనవసరంగా తిడుతున్నా నోట్లో నాలుక లేనట్లు నిశ్శబ్దం వహించి వచ్చే, ఏ క్షుద్రుణ్ణో కట్టుకొని –

–ఈయనగారు 'నా భర్త' అని ఎలా చెప్పుకోను?

వీరరాఘవుని అండ చూచుకుని, ఘోర రాక్షస సంకులమైన అరణ్యాలకు కూడా ఉత్సాహంగా ప్రయాణమవగలిగిన సీత అదృష్టాన్ని మెచ్చుకోవటానికి అలవాటుపడ్డ నేను–

యెవరైనా ఆచి చెంపను చరిస్తే కిక్కురుమనకుండా సొమ్మసిల్లి వూరుకునే ఏ బలహీనుణ్ణో కట్టుకొని–

'వీరే నా భర్త'–అని ఎలా చెప్పుకోను?

పెద్ద పెద్ద ప్రభుత్వాలనే కూకటి వేళ్ళతో విమర్శించి పోట్లాడుతూ వారి ఆయుధాలను నిరస్త్రాలుగా యెదిరించి ప్రాణాలనే నవ్వుతూ అర్పించిన, అర్పించగల ధీర సోదరీలను తలచుకొని గర్వించడానికి అలవాటుపడ్డ నేను–

ఉపాధ్యాయుల కోపాలకూ, ఆఫీసర్ల కోపాలకూ, అధికార్ల కోపాలకూ జడిసి– అన్యాయమైన క్షుద్రకోపాలకు వెరచి – తనలోని న్యాయసమ్మతమైన అసంతృప్తులనూ, కోపాలనూ కూడా గుటకలు వేస్తూ కుమ్మి పెట్టుకొని, పైగా వారి పరోక్షంలో – అప్పుడు కూడా గోడలకు చెవులుంటాయని సన్నని కంఠాలతో – ఏడిచే ఏ పిరికిపందనో కట్టుకొని –

'ఈయన నా భర్త' అని ఎలా చెప్పుకోను?

బ్రతుక్కి సాఫల్యం 'ధనం సంపాయించటం, కూడెయ్యటం' మాత్రం అనుకుంటూ ధనం అంటే యేమిటి? లోహంకూ, విలువకూ గల సంబంధం యేమిటి? ధనం సంపాయించటం ఆవశ్యకత ఏమిటి? నిలువ చెయ్యటం ఎందుకు? అనే విషయాలు తెలియకండానే గుడ్డిగా డబ్బు సంపాయించి నిలవ్వేసే – కలిగిన దరిద్రుని –ఏ లోభినో కట్టుకొని–

'ఈ మూర్ఖుడు నా భర్త' అని యెలా చెప్పుకోను.

ప్రపంచమంతా తన ననుసరించి తిరగాలి అన్నట్టు – తన దారికి అడ్డు తగిలే వారినీ, తనకన్నా నిజానికి గొప్పవారైనా – వారిని కించపరుస్తూ నీచంగా తిట్టే యే అల్పుణ్ణో కట్టుకొని–

'యీ పురుగు నా భర్త' అని ఎలా చెప్పుకోను?

నా యెర్రని వంపులు దేరిన పెదవులను – యే దుర్వాసనలకో,

చక్కగా పెంచుకున్న నా పరిపూర్ణ దేహాన్ని యే జబ్బుచేతులకో,

నవనీతం వంటి నా హృదయాన్ని – అసహ్యమూ కఠినమూ అయిన యే నల్లరాతి గుండెకో,

తలలో నాలుకలా సంఘం కోసరం తయారు చేసిన నా స్వభావాన్ని – ఏ పులిజాతి స్వభావానికో,

ఎలా అప్పగించనూ?

సమ్మోహన జనకములైన నా జీవిత వీణాతంతువులను ఏ నక్క వూళతోనో యెలా మేళవింపనూ?

ఎలా–? ★

*(ఆనందవాణి: మార్చి 1946)*